ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం



ప్రజావాణిలో జోనల్‌ కమిషనర్, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి పలు ఫిర్యాదులను జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్, అధికారులకు అందజేశారు. ఇంజనీరింగ్‌ 5, టౌన్‌ప్లానింగ్‌ 8, హెల్త్‌ అండ్‌ శానిటేషన్‌ 1, రెవెన్యూ 1 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుంచి అందుకున్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌ జగదీష్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: హెచ్‌ఎంటీ హిల్స్‌ తులసినగర్‌ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ పొందుతున్న స్వస్థ స్పోర్ట్స్‌ కరాటే అకాడమి బృందం విద్యార్థులు ఒంగోలులో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని అత్యధిక పతకాలు సాధించారు. 10 ఏళ్లలోపు పోటీల్లో లక్షిత వెండి పతకం, 12ఏళ్ల లోపు పోటీల్లో హరిణి కాంస్యం, బంగారం పతకాలు, అభిజిత్‌ బంగారం పతకం అభిరాం వెండి, బంగారం పతకాలు సాధించారు. 13 ఏళ్లలోపు పోటీల్లో హృతిక బంగారం, ఖ్యాతి వెండి, రిషి కాంస్యం పతకాలను సాధించారు. 14 ఏళ్లలోపు పోటీల్లో అశ్వికరావు బంగారం, వైశాలి కాంస్యం, వెండి పతకాలను సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్‌ జగదీష్‌ అభినందించారు.

ప్రత్యేక పూజలు



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలోని పాపిరెడ్డినగర్‌ కాలనీలోని శ్రీఓంకారేశ్వర శివాలయం, భక్త మార్కండేయ దేవాలయం వార్షిక మహోత్సవానికి సోమవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్, చంద్రారెడ్డి, ప్రభాకర్‌ పద్మశాలి, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని షిర్డీహిల్స్, బుద్ధ విహార్‌లో వసతులు కోసం స్థానికులు సోమవారం కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. పార్కు అభివృద్ధి, వాకింగ్‌ ట్రాక్, సీనియర్‌ సిటిజన్స్‌ కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని విన్నవించామని, దీనికి జోనల్‌ కమిషనర్‌ సానుకూలంగా స్పందించి త్వరలో బుద్ధ విహార్‌ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు కాలనీవాసులు తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

చింతల్‌: కుత్బుల్లాపూర్‌ వాటర్‌వర్క్స్‌ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో భాగంగా తాగునీరు రావడంలేదని మూడు ఫిర్యాదులు, అధిక బిల్లులు వస్తున్నాయని మూడు ఫిర్యాదులు, నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేయాలని రెండు ఫిర్యాదులు, మురుగు నీరు మ్యాన్‌హోల్‌ నుంచి పొంగి రోడ్లపై పారుతోందంటూ ఒక ఫిర్యాదు రాగా, బోర్‌వెల్‌ మరమ్మతుల కోసం ఒక ఫిర్యాదు, కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని మరో ఫిర్యాదు అందింది. ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వాటర్‌ వర్క్స్‌ అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణిలో డీజీఎం వికాస్, మేనేజర్లు పాల్గొన్నారు.


24న సాగర్, ఎత్తిపోతల సందర్శనకు సూపర్‌ లగ్జరీ బస్‌

మియాపూర్‌: నాగార్జునసాగర్, ఎత్తిపోతల సందర్శనకు ఒకరోజు టూర్‌ ప్యాకేజీతో సూపర్‌ లగ్జరీ బస్సు నడపనున్నట్లు మియాపూర్‌ డిపో మేనేజర్‌ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 5 గంటలకు మియాపూర్‌ నుండి బయల్దేరి రాత్రి 8 గంటలకు మరలా మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఆసక్తి గల ప్రయాణికులు 8500309052 నంబర్‌కు ఫోన్‌ చేసి టికెట్లు బుక్‌ చేసుకోవాలని తెలిపారు. ఒక్కో టికెట్‌ ధర రూ.1200 ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రసాయ'నాలా'తో.. అల్లాడుతున్న జనం

- రసాయనాల వ్యర్థాలతో ప్రజలకు రోగాలు
- సుందరీకరించాలని స్థానికుల వినతి

మురికి కూపంగా మారిన పరికి చెరువు







ఆల్విన్‌కాలనీ: రసాయన వ్యర్థ జలాలతో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌ సర్కిళ్ల మధ్య ఉన్న పరికి చెరువులో రసాయన వ్యర్థాలు చేరడంతో నీరు కలుషితమై పారుతుండటంతో ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దాంతో పాటు గాలి వీస్తుండటంతో నురగ ఇళ్లలోకి చేరుతోంది. ఇంటి పరిసరాల్లోని అన్ని ప్రాంతాల్లో నురుగు నిండిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు రసాయనాల వాసనకు అనారోగ్యానికి గురవుతున్నారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలోని గాజులరామారం, జీడిమెట్ల ఇండస్ట్రియల్‌ పరిధిలోని నాలాలో రసాయన వ్యర్థాలు కలిసి చెరువులోకి చేరుతున్నారు. చెరువు మత్తడి ద్వారా ఆల్విన్‌ కాలనీ, ధరణినగర్, మాధవరంనగర్, వెంకటేశ్వరనగర్‌ పరిసర ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్‌ నాలాలో కలుస్తుంది. గతంలో పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులు బెంగళూరు నుంచి వచ్చేసి చెరువులోని నీటిని టెస్టింగ్‌ కోసం తీసుకువెళ్లి పరిశీలించిన దాఖలాలు కూడా ఉన్నాయి. వ్యర్థాలు కలవడంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి పలుమార్లు నివేదికలు అందజేశారు. అయినా పరిస్థితిలో ఏ మాత్రం మా ర్పు రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పట్లో ఎంతో ఆహ్లాదకరంగా..

పరిశ్రమల నుంచి భారీగా ముడుపులు అందుతుండటంతోనే పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గుట్టుచప్పుడు కాకుండా నాలాల్లో వ్యర్థాలు వదులుతున్నా వారిపై ఎలాంటి నిఘా పెట్టడం లేదని దాంతో చెరువు కలుషితం అవుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు మంచి నీటి చెరువుగా ఉన్న చెరువులోని నీరు ప్రస్తుతం విషంగా మారింది. ఒకప్పుడు ఈ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. పెద్దసంఖ్యలో పక్షులు, నెమళ్లు వచ్చేవి. తర్వాతి రోజుల్లో ఈ ప్రాంతం కాలుష్యంతో నిండిపోవడంతో వాటి సంచారం తగ్గిపోయింది. ఇక్కడి చెరువు కాలుష్యం కారణంగా వాటర్‌ బోర్డు అందించే నీటిపైనే ఇక్కడి కాలనీవాసులు ఆధార పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పరికి చెరువు కలుషిత జలాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి చెరువులో రసాయన వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని, హైడ్రా అధికారులు చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకోవాల్సిన అసవరం ఉందని, చెరువు చుట్టూ ఉన్న వివిధ కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సుందరంగా తీర్చిదిద్దాలి



పరికి చెరువులో కలుషిత జలాల ద్వారా స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి చెరువులా ఉండే పరికి చెరువు మురికి కూపంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు ప్రస్తుత హైడ్రా అధికారులు పరికి చెరువును సందర్శించి చెరువులో రసాయన వ్యర్థాలు కలవకుండా చర్యలు చేపట్టి సుందరంగా మార్చాల్సిన అవసరం ఉంది.

– గోపాల్, అధ్యక్షుడు, ధరణినగర్‌ సంక్షేమ సంఘం

బాలాజీనగర్‌లోని సమస్యలను పరిష్కరించాలి



కూకట్‌పల్లి డీసీకి వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌ కుమార్‌ గౌడ్, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ బాలాజీనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు వినోద్‌ కుమార్‌ గౌడ్‌ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలల తరబడి వెలగని వీధి లైట్లు, పార్కుల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారం, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్‌ పోల్స్‌ సమస్య, అనుమతులు లేకుండా సర్వీస్‌ రోడ్డులో నిర్వహిస్తున్న అక్రమ వ్యాపారాలు, హాస్టల్స్‌ వంటి పలు సమస్యలను డిప్యూటీ కమిషనర్‌ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు వినతి పత్రాలు సమర్పించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. లేదంటే బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతిరెడ్డి, శివచారి, వెంకటరమణ, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, సంతోష్, మధురెడ్డి, సుదర్శన్‌ రెడ్డి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బీటెక్‌ విద్యార్థులకు ఓరియెంటేషన్‌ ప్రోగ్రామ్‌



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టి.కిషన్‌ కుమార్‌రెడ్డి తదితరులు

బాలానగర్‌: అధ్యాపకుల నైపుణ్యాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని జేఎన్టీయూహెచ్‌ వీసీ టి.కిషన్‌ కుమార్‌ రెడ్డి అన్నారు. జేఎన్టీయూలో నూతనంగా బీటెక్‌ కోర్సులో చేరిన విద్యార్థులకు సోమవారం ఓరియెంటేషన్‌ ప్రోగ్రామ్‌ నిర్వహించారు. ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని కొనసాగించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించి తరచూ పర్యవేక్షించాలన్నారు. కాన్సెప్టులు, లాబొరేటరీ లెర్నింగ్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు బలమైన విద్యా విధానం కలిగి ఉన్న కొత్త అభ్యాసన నమూనాకు అనుగుణంగా విద్యార్థులు మారాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్‌ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్‌ కె.వెంకటేశ్వరరావు, వర్సిటీ ప్రిన్సిపాల్‌ జి.వి.నరసింహారెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ ఏ.రఘురామ్‌ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన గోడ



మూసాపేట: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు భరత్‌నగర్‌ కాలనీలోని హరిహరక్షేత్రం ప్రహరీ సోమవారం ఉదయం కూలిపోయింది. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రహరీ కావడంతో వర్షాలకు నానిపోయి కూలిపోయింది. నిత్యం ఆ ప్రాంతంలో స్థానికులు కూర్చుని ఉండేవారు. ఉదయం ఎవరూ లేని సమయంలో కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మాజీ చైర్మన్‌ పి.నాగిరెడ్డి కూలిన గోడను పరిశీలించి కొత్తగా గోడ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు

మండప నిర్వాహకులు సహకరించాలి



వినాయక మండపాల వద్ద జాగ్రత్తలను వివరిస్తున్న పురేంధర్‌రెడ్డి, పోలీస్‌ ఉన్నతాధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మున్సిపల్, కూకట్‌పల్లి పోలీస్‌ అధికారులు వినాయక మండపాల గురించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌ పీవీ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎన్‌కేఎన్‌ఆర్‌ గార్డెన్స్‌లో సోమవారం వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడుతూ మున్సిపల్‌ అధికారులు ప్రతిరోజూ మండపాల వద్ద శుభ్రం చేసి బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లాలని, అదే విధంగా నిమజ్జనం రోజు కాలనీలో విద్యుత్‌ వైర్లు వేలాడుతుండటంతో షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని, విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులకు నిమజ్జనం చేసే సమయంలో నిర్వాహకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రశేఖర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్‌.శ్రీధర్‌రావు, జి.ప్రసాద్, ఉత్తం చౌదరి, సూర్యనారాయణ, వినాయక యూత్‌ కమిటీ సభ్యులు రిత్విక్, రోహిత్, సాయిభార్గవ్‌ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



హెచ్‌ఏఎల్‌ హైదరాబాద్‌ డివిజన్‌ కన్వీనర్‌ కె.వెంకటాద్రిని సన్మానిస్తున్న నాయకులు, కార్మికులు

కూకట్‌పల్లి: బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్‌ కార్మికులకు సంబంధించిన ఇన్సెంటివ్‌ సమావేశానికి ఆల్‌ ఇండియా కో–ఆర్డినేషన్‌ కమిటీ హైదరాబాద్‌ డివిజన్‌ కన్వీనర్‌ కె.వెంకటాద్రి బెంగళూరు కార్పొరేటర్‌ ఆఫీసులో జరిగిన సమావేశంలో పాల్గొని 12 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న మంత్లీ ఇన్సెంటివ్, క్యూపీపీ, ఆన్యువల్‌ ఇన్సెంటివ్‌ తదితర అంశాలపై యాజమాన్యంతో చర్చించి కార్మికులకు అనుకూలంగా యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికులకు మేలు చేశారు. ఈ సందర్భంగా సోమవారం బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్‌ పరిశ్రమలో ఉన్న యూనియన్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మికులు వెంకటాద్రిని ఘనంగా శాలువాతో సన్మానించి పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ బాబు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌లు గణేష్, కర్క నాగరాజు, అన్వర్, వైస్‌ ప్రెసిడెంట్‌లు కూతడి కృష్ణ, ప్రభాకర్‌ రెడ్డి, అశోక్, అనిల్‌రెడ్డి, నాగరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాంచందర్, బాబీ, జోగారావు, పురుషోత్తం, శ్రీధర్, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

వీరత్వం, పరాక్రమానికి ప్రతీక.. సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌

బహుజన వీరుడు సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ జయంతి సందర్భంగా సోమవారం పలువురు నాయకులు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక సర్దార్‌ సర్వాయిపాపన్న గౌడ్‌ అని పేర్కొన్నారు. ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ రాజరిక పోడకలకు వ్యతిరేకంగా సబ్బండ వర్గాలను ఏకం చేసిన పాపన్న పోరాడిన తీరు గొప్పదని గుర్తుచేశారు.

– కూకట్‌పల్లి



కూకట్‌పల్లిలో సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్‌ మాధవరం రంగారావు



కూకట్‌పల్లిలో కాంగ్రెస్‌ సీనియర్‌ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, రమేష్‌



ఆల్విన్‌కాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌



పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం నాయకులు



పాండురంగనగర్‌ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న గంట శ్రీనివాస్‌ గౌడ్‌ తదితరులు



మూసాపేటలో కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌

షటర్లను కూల్చివేసిన హైడ్రా అధికారులు





నాలాపై అక్రమంగా నిర్మించిన షటర్లను కూల్చివేసిన హైడ్రా అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండలంలోని ఏవీబీపురంలో నాలా ఆక్రమణలను హైడ్రా అధికారులు సోమవారం తొలగించారు. పరికి చెరువు నుంచి కూకట్‌పల్లి నాలాలో కలిసిన దీని వెడల్పు 10 మీటర్లు 3 మీటర్లకు కబ్జాకు గురైంది. ఈ నాలాపై రెండు షట్టర్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల విక్రయాలు, మరమ్మతుల షాపులు నిర్వహిస్తున్నారు. నాలా ఆక్రమణతో సాయిబాబా కాలనీ, హెచ్‌ఏఎల్‌ కాలనీ, మైత్రీ నగర్‌లో వరద ముంచెత్తుతోంది. దీంతో వరద సాఫీగా సాగకపోవడంతో తమ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో జలమండలి అధికారులు పరిశీలించారు. జలమండలి అధికారుల నివేదిక మేరకు హైడ్రా ఈ కూల్చివేతలు చేపట్టింది. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

నేడు ప్రైవేటు స్కూలు టీచర్లకు శిక్షణ

రాయదుర్గం: శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రైవేట్‌ మేనేజ్‌మెంట్‌ బడ్జెట్‌ స్కూళ్ల టీచర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తారు. ప్రైవేట్‌ బడ్జెట్‌ స్కూళ్లలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులు బోధించే టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యాధికారి సుశీంద్రారావు ఉత్తర్వులు జారీ చేశారని ప్రైవేట్‌ మేనేజ్‌మెంట్‌ బడ్జెట్‌ స్కూళ్ల అసోసియేషన్‌ అధ్యక్షుడు నిజామ్‌ అలీఖాన్‌ తెలిపారు. ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం టీచర్లకు రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో, తెలుగు, హిందీ, సబ్జెక్టుల టీచర్లకు మియాపూర్‌లోని సెయింట్‌ రీటా పాఠశాలలో శిక్షణ నిర్వహిస్తారు.

శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంవివేకానందనగర్‌ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌ 35వ బ్లాక్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నూతన కార్యవర్గం సభ్యులు సోమవారం వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమస్యలను తన దృష్టికి కానీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాములు సాగర్, రామ్‌సాగర్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి అనిల్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావుతో అసోసియేషన్‌ సభ్యులు